ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
శుక్రవారం 8 మార్చి 2024

ప్రజల కోసం జైలుకెళ్లిన చరిత్ర నాది

● ప్రజల కోసం వంద కేసులు భరిస్తున్నా
● ప్రజాహిత యాత్రలో బండి సంజయ్‌కుమార్


చొప్పదండిలో ప్రజాహిత యాత్రలో పాల్గొన్న బండి సంజయ్‌కుమార్

చొప్పదండి, మార్చి 7 ప్రజల కోసం జైలుకెళ్లిన చరిత్ర తనదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం చొప్పదండిలో నిర్వహించిన ప్రజాహిత యాత్రలో ఆయన మాట్లాడారు. ప్రజలకోసం రేయింబవళ్లు కొట్లాడితే తన వంద కేసులు నమోదు చేశారని, ప్రజల కోసమే తాను వాటిని భరిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల పేరు చెప్పి ఆరు గ్యారెంటీలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వంద రోజుల్లో హామిలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో హామీలు అమలు చేయకుండా డ్రామాలు ఆడుతోందన్నారు. కరీంనగర్‌లో ముస్లింలందరూ కలిసి తనను ఓడించారని, హిందువులంతా మేల్కొని ఎంపీగా గెలిపించాలన్నారు.

కరీంనగర్‌కు ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తున్నారని, తాను చేసిన అభివృద్ధిపై రూపొందించిన బుక్‌లెట్‌ను కేసీఆర్‌కు పంపించానన్నారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, గెలిస్తే బీఆర్ఎస్ దుకాణం బంద్ చేస్తారా అని సవాల్ విసిరారు. కేటీఆర్ సవాల్‌కు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కేసీఆర్‌ను తీసుకువస్తే కరీంనగర్‌కు ఎవరేం చేశారో చర్చించేందుకు సిద్ధమన్నారు. దమ్ముంటే తన సవాల్‌కు స్పందించి రావాలన్నారు. కరీంనగర్ అభివృద్ధితో పాటు తాను చేసిన పోరాటాలు, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై కరీంనగర్ కమాన్ వేదికగా చర్చించేందుకు సిద్ధమన్నారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ కార్యాలయానికి కిరాయి కట్టకపోతే కేసీఆర్‌పై కేసు నమోదైందన్నారు. చొప్పదండి గడ్డ అంటేనే ధైర్యం సాహసానికి పెట్టింది పేరన్నారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలు అభివృద్ధి చేస్తానని కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. అన్ని పనులకు మోదీ నిధులు ఇస్తే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేశారని, ఈసారి అలా చేయవద్దని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, సింగిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'కదనభేరి'ని విజయవంతం చేయండి..

● ఎవరికివారు బూత్‌లపై దృష్టిపెట్టి ఎంపీగా గెలిపించండి
● తర్వాత మీ గెలుపు బాధ్యత మాది
● బండి సంజయ్‌కు దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలి
● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

కరీంనగర్ టౌన్, మార్చి 7: ఎస్సారార్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కదనభేరి బహిరంగ కార్యకర్తలు, పార్టీశ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బ్రహ్మాండంగా విజయవంతం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. కదనభేరి సభ సన్నాహక సమావేశం కరీంనగర్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ నియోజకవర్గాని చేసిందేమి లేదన్నారు. దమ్ముంటే కరీంనగర్ కమాన్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. శివలింగంపై తేలులాగా రాముడి ఫొటో అడ్డం పెట్టుకుని నీచమైన మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌నుద్దేశించి నీవు నీతల్లికే పుట్టావని రుజువు ఏమిటని మాట్లాడి మహిళలను అవమానపరిచినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మన కోసం గర్జించే, పార్లమెంట్‌లో కరీంనగర్ వాణిని వినిపించేందుకు వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపిస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించుకునే బాధ్యత మేము తీసుకుంటామని బీఆర్ఎస్ నేతలకు హామీ ఇచ్చారు. బీజేపీకీ, బీఆర్ఎస్ బీటీం కాదని, బీటీం అయితే కవితపై ఎందుకు కేసులు పెట్టి ఇబ్బంది పెడతారని ఆయన ప్రశ్నించారు. కరీంనగర్‌లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీకి, బండి సంజయ్‌కి వేసినట్లేనని అన్నారు.


బీఆర్ఎస్ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 12న నిర్వహించనున్న కరీంనగర్ కదనభేరి బహిరంగ సభకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చి విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఒక్క రోజైనా పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై కానీ, నియోజకవర్గ అభివృద్ధిపైగానీ, తెలంగాణపైగానీ రెండు నిమిషాలు మాట్లాడని నాయకుడు ఎంపీగా ఎందుకు ఉండాలని ప్రశ్నించారు. యూపీలో భద్రి ప్రాజెక్టు జాతీయ హోదా కల్పించారని, తెలంగాణాకు చెందిన నలుగురు బీజేపీ, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణ ప్రాజెక్టులపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ఎంపీగా గెలిస్తే ఐఐటీ కరీంనగర్‌కు తీసుకు వచ్చేవాడినని, ఈ విషయంపై ప్రజల్లో చర్చ పెట్టాలని పార్టీ శ్రేణులను కోరారు. అభివృద్ధిపై సంజయ్‌కి ఆలోచన లేదని, ధర్మం, మతం అంటూ ప్రవచనాలు చెప్పే సంజయ్ ఓ మఠం, ఆశ్రమం పెట్టుకోవాలని సూచించారు. ఎంపీగా గెలిచిన తర్వాత ఒక్క మండలానికి కూడా వెళ్లలేదని, తాను ఓడిపోయిన తర్వాత నియోజకవర్గంలో తిరిగినట్లు సంజయ్ తిరుగలేదని అన్నారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే రైతులు కరెంటు లేక, సాగునీరు లేక పంటలు ఎండిపోయి అయోమయానికి గురవుతున్నారని, వారికి అండగా నిలిచి పోరాడుదామన్నారు. 12న జరిగే కరీంనగర్ కదనభేరి సభను విజయవంతంచేసి ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులు తప్పుడు కేసులు పెడితే అధికారంలోకి రాగానే మిత్తితో సహా తీసుకుంటామని, జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. రెండు లక్షల మెజార్టీతో వినోద్‌కుమార్ ఎంపీగా గెలువడం ఖాయమన్నారు.

సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వొడితెల సతీష్‌కుమార్, సుంకె రవి శంకర్, వి మోహన్‌రెడ్డి, నాయకులు చల్మెడ లక్ష్మీ నర్సింహారావు, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, హన్మకొండ జడ్పీ చైర్‌పర్సన్లు కనుమల్ల విజయ, దావ వసంత, అరుణ రాఘవరెడ్డి, డాక్టర్ సుధీర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల అధ్యక్షుడు తోట ఆగయ్య, కలువకుంట్ల విద్యాసాగర్ రావు, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, నారదాసు లక్ష్మణ్‌రావు, మేయర్ యాదగిరి సునీల్ రావు, సర్దార్ రవీందర్‌సింగ్, గెల్లు శ్రీనివాస్, అనిల్‌కుర్మాచలం, బండ శ్రీనివాస్, లోక బాపురెడ్డి, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, కర్ర శ్రీహరి, జమీలొద్దీన్, గూడూరి ప్రవీణ్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

ఓం నమశ్శివాయ

నేడు మహా శివరాత్రి.. ముస్తాబైన ఆలయాలు



కరీంనగర్ కల్చరల్, మార్చి 7: మహా శివరాత్రి పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. యేటా వచ్చే 12 మాస శివరాత్రులలో మాఘ బహుళ చతుర్దశి పరమ శివునికి ప్రీతి పాత్రమైనదిగా భక్తులు విశ్వసిస్తారు. శివుడు జ్యోతి స్ఫటిక లింగాకారంలో శివరాత్రి అర్ధరాత్రి ఉద్భవించినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షతో ప్రత్యేక పూజలు, అర్చనలు, జాగరణలు చేస్తారు. లింగోద్భవ కాలం (రాత్రి 12 గంటలు) తర్వాత అభిషేకం చేయాలని శైవాగమం చెబుతుంది.

ముస్తాబైన శివాలయాలు

మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా నగరంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. పాతబజార్ గౌరీశంకరాలయం వద్ద దర్శనం కోసం క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు తాగునీటి వసతి, షామియానాలు సిద్ధం చేశారు. కమాన్‌రోడ్ రామేశ్వరాలయంలో దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భగత్‌నగర్ భవానీ శంకరాలయం వేడుకలకు సిద్ధమయింది. ఆదర్శనగర్ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేయగా ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అభిషేకాలు కొనసాగనున్నాయి. సాయంత్రం శివపార్వతుల కల్యాణాన్ని, రాత్రి పల్లకీసేవను నిర్వహించనున్నారు. శ్రీహరినగర్, వీరాంజనేయ సహిత రామలింగేశ్వరాలయంలో ఏర్పాట్లు చేశారు.

మార్కెట్‌లో సందడి

మహాశివరాత్రి పండుగ సందర్భంగా మార్కెట్‌లో సందడి నెలకొంది. పండుగకు కావాల్సిన గోగుపూవు, శనక్కాయ, కందగడ్డ, కంచులు, వత్తులు, దీపం నూనె, మారెడుకాయలు, పత్రి, పూలు, పండ్లు, పంచామృతాలు, భస్మం, గంధం, గంగనీళ్ళు తదితర వస్తువులకు గిరాకీ పెరిగింది. రైతులు, వ్యాపారులు రెండు రోజుల నుంచి అమ్మకాలు ప్రారంభించారు. మార్కెట్ వినియోగదారులతో కిట కిటలాడుతోంది. మరోవైపు పూజా సామగ్రి విక్రయ కేంద్రాలు కొనుగోళ్లతో సందడిగా మారాయి.

ఎనిమిది మంది ఎస్ఐల బదిలీ

కరీంనగర్ క్రైం, మార్చి 7: పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది ఎస్ఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు గురువారం పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ మూడో ఠాణా ఎస్ఐ టి తిరుపతి వీణవంక ఎస్ఐగా, వీణవంక ఎస్ఐ బి వంశీకృష్ణను కరీంనగర్ సీఎస్‌బీకి బదిలీ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ2 ఎన్ కిరణ్‌రెడ్డిని గంగాధరకు, గంగాధరలో ఉన్న ఎస్ఐ పి అభిలాష్‌ను ట్రాఫిక్‌కు, రామడుగు ఎస్ఐ ఎన్ రమేష్‌ను వీఆర్‌కు, కరీంనగర్ మూడో ఠాణా ఎస్ఐ ఎం సురేందర్‌ను రామడుగు ఎస్ఐగా నియమించారు. కరీంనగర్ రూరల్ ఎస్ఐ కె రాజును కరీంనగర్ టాస్క్‌ఫోర్స్-2 ఎస్ఐగా, కరీంనగర్ రెండో ఠాణా ఎస్ఐ వి శేఖర్‌ను కరీంనగర్ రూరల్ ఎస్ఐగా బదిలీ చేశారు.

సాగు, తాగు నీటి ఎద్దడిని నివారించండి

● జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్
● మేడిగడ్డ మరమ్మతులపై ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ వాకౌట్
● అర్ధంతరంగా ముగిసిన సమావేశం


మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ పోడియం ఎదుట బైఠాయించిన సభ్యులు

కరీంనగర్ టౌన్, మార్చి 7:'జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయి.. సాగు నీరు ఎందుకు ఇవ్వడం లేదు.. మరో వైపు వరిపైరుకు మొగి పురుగు సోకి నష్టం చేస్తోంది.. కరెంటు సరిగా ఇవ్వడం లేదు.. అధికారులు సాగు, తాగునీటి ఎద్దడికి తీసుకుంటున్న చర్యలేమిటో చెప్పాలి' అంటూ బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రశ్నించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా మాన కొండూర్ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్, కోఆప్షన్ సభ్యుడు షుక్రుద్దీన్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా సాగు, తాగు నీటి విషయంపై స్పష్టత ఇవ్వాలని, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల నీటి ఎద్దడి నెలకొందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న పిల్లర్లకు మరమ్మతులు చేసి రైతులకు సాగు, తాగునీరు అందించాల్సిందిపోయి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

గంగాధర ఎంపీపీ శ్రీరాంమధుకర్ మాట్లాడుతూ సాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎస్సారెస్పీ అధికారులు సమాధానమిస్తూ మార్చి 31 తర్వాత సాగునీరు అందించడం కుదరదని, ముందే వరి పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసు కోవాలని సూచించామన్నారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో నీటి నిలువ చేయడం సాధ్యం కాదని, మార్చి 31 వరకు నీరు ఇస్తామని తేల్చి చెప్పారు. కో ఆప్షన్ సభ్యుడు షుక్రూద్దీన్ మాట్లాడు తూ కొత్తపల్లి-వెలిచాల మధ్య ఎస్సారెస్పీ స్థలంలో వేసుకున్న గుడిసెలను తొలగించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయించాలని, కాళేశ్వరంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని నిరసిస్తూ పో డియం ఎదుట బైఠాయించారు. అనంతరం వాకౌట్ చేశారు. దీంతో సమావేశం అర్ధంతరంగా ముగిసింది. అంతకు ముందు మేడిగడ్డ బ్యారేజ్‌కు మరమ్మతులు చేయాలని కోరుతూ జడ్పీలో తీర్మానం చేశారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపాల్‌రావు, సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.


● నిధులపై సంజయ్ శ్వేతపత్రం విడుదల చేయాలి

చిగురుమామిడి జడ్పీటీసీ గీకురు రవీందర్ సమావేశంలో ఎంపీ బండి సంజయ్‌పై లేఖను రాసి సభ్యులకు, అధికారులకు పంపిణీ చేశారు. ఎంపీగా ఐదేళ్లలో ఒక్కసారి కూడా జడ్పీ సమావేశానికి హాజరు కాలేదని, ఎంపీ నిధులు నయాపైసా ఇవ్వలేదన్నారు. ఎంపీగా ఎన్ని నిధులు తెచ్చారో, ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.























మహా జన జాతర

- వేములవాడ రాజన్న క్షేత్రంలో మహా శివరాత్రి వేడుకలు ప్రారంభం
- పెద్ద సంఖ్యలో తరలివస్తున్న జనం
- భక్తులకు ఉచిత బస్సుల సౌకర్యం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అధికారులు


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ/వేములవాడ టౌన్, మార్చి 7: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజులపాటు శివభక్తుల సందడిలో సాగే రాజన్న మహా జన జాతర మహోత్సవాలు గురువారం సాయంత్రం కన్నుల పండుగగా మొదలయ్యాయి. బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాజేశ్వర స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు. గుడి మైదానంలో శివార్చన ప్రారంభించారు. తెలంగాణలో అతిపెద్ద శైవక్షేత్రంగా ఉన్నా వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రానికి తెలంగాణ, ఆంధ్రా, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి భక్తులు అశేషంగా తరలివస్తున్నారు. శుక్రవారం మహాశివరాత్రి శివుడి పర్వదినాన్ని రాజన్న క్షేత్రంలోనే జాగరణతో జరుపుకోవడానికి దాదాపు 2 లక్షల మంది తరలివస్తారని అంచనాలు వేసిన అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకల కోసం రూ.3 కోట్ల వరకు ఖర్చు చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. దూర తీరాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, ఏర్పాటు చేశారు. ఈ సారి ఉచిత పాస్‌లను రద్దు చేసి ప్రతి


పూలతో అలంకరించిన ఆలయం

ఒక్కరూ రూ.300 చెల్లించి వీఐపీ దర్శనాల క్యూలైన్లో వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం నాలుగు లక్ష రాజన్న లడ్డు ప్రసాదాలను సిద్ధం చేశారు. 27 చోట్ల తాగునీటికి ఇబ్బంది లేకుండా చలి వేంద్రాలు, 7 చోట్ల రాజన్న జల ప్రసాదం, లక్ష మజ్జిగ ప్యాకేట్లు, శుద్ధ జల క్యాన్‌లు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాలు నిరంతరం భక్తులకు వైద్య సేవలు అందించడానికి శిబిరాలను ఏర్పాటు చేశారు. పారిశుధ్య నిర్వాహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాత్కలిక స్నానపు గదులు, మరుగుదొడ్లు, మహిళలు బట్టలు మార్చుకోవడానికి గదులను అందుబాటులోకి తెచ్చారు.

రాజన్నకు కోడె మొక్కులు..

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామికి ప్రత్యేకంగా కోడెమొక్కులను భక్తులు చెల్లించుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో మూడు రోజుల పాటు అర్జిత సేవలు రద్దు చేసి నిరంతర దర్శనాలను కల్పించారు. గురువారం రాత్రి 7 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే పట్టు వస్త్రాలు, అలాగే తెలంగాణ ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాల సమర్పణ అనంతరం రాత్రి 9 గంటలకు నిశిపూజ భక్తులకు లఘు దర్శనం, కోడెమొక్కులను కొనసాగించారు. శుక్రవార మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి 12 నుంచి 3 గంటల వరకు పురజనులకు సర్వదర్శనం, 3.30 గంటల నుంచి 4 గంటలవరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు, 4 గంటల నుంచి 4.25 వరకు సుప్రభాతం, 4.25 నుంచి 6 గంటల వరకు ప్రాతకాల పూజ, అనువంశిక అర్చకుల దర్శనం కల్పించారు. సాయంత్రం 4 గంటలకు శివదీక్ష స్వాముల దర్శనానికి కల్పించారు.

మహాలింగార్చన..

మహాశివరాత్రి పర్వదినంలో మహాఘట్టమైన మహా లింగార్చన శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభిస్తారు. రాత్రి 11.35 నిముషాలకు లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. శనివారం చివరి రోజు భక్తుల మొక్కుబడులు, అర్జిత సేవలు ప్రారంభం కానున్నాయి.

విద్యుత్ దీపాలతో అలంకరణ..

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంతో పాటు అనుబంధ దేవాలయాలు విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా మారాయి. ప్రధాన దేవాలయంలో తీరోక్క పూలలో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్‌కు చేరుకోవడానికి ఆర్టీసీ అధికారులు 900 బస్సులను నడుపుతున్నారు. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయం వరకు 14 ఉచిత బస్సులను ప్రారంభించారు. భక్తులు వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి 8 చోట్ల స్థలాలు ఏర్పాటు చేశారు.

జాతరకు భారీ బందోబస్తు..

మహా శివరాత్రి జాతరలో ఏలాంటి సమస్యలు తలేత్తకుండా భక్తులు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు చేసుకునే విధంగా భారీ పోలీస్ బందోబస్తు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 1400 మంది పోలీస్ సిబ్బందితో పాటు అన్నీ ప్రాంతాల్లో సీసీ కమెరాలను ఏర్పాటు చేశారు. మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, దేవస్థానం ఈవో కృష్ణప్రసాద్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఏర్పాట్లు పరిశీలించి సూచనలు చేశారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

గ్యారంటీలను అమలు చేసే శక్తి ఇవ్వాలని వేడుకున్నాం
- మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ/వేములవాడ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీల అమలు జరిపే శక్తిని ఇవ్వాలని మహాశివరాత్రి సందర్భంగా శివుడిని వేడుకున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ మహాశివరాత్రి సందర్భంగా శ్రీస్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు. ప్రభుత్వాలు ఏవి వున్న, మేము అధికార పక్షంలో వున్న, ప్రతి పక్షంలో వున్న సర్వేజన సుఖినో భవంత్ అందరు సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని అన్నారు. స్వయంగా మహా శివరాత్రి జాతరకు ముఖ్యమంత్రి రావాల్సివుండేది, డిల్లీలో వున్న సమావేశాలతో రాలేకపోయారు. ఎన్నికల కోడు అమలులోకి రాకపోతే వారం రోజుల్లో వేములవాడను సందర్శించి శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారని తెలిపారు. రాజన్న భక్తుడిగా వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి పాటుపడుతామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కని విని ఎరగని రీతిలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు చేశామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు సైతం సేవతో పని చేస్తున్నారని తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్లతో భూకబ్జా కేసులో
తహసీల్దార్ అరెస్టు
- పరారీలో మరికొందరు


తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను జైలుకు తరలిస్తున్న సీఐ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ క్రైం, మార్చి 7: నకిలీ ధ్రువపత్రం సృష్టించి, భూమి ఆక్రమించిన కేసులో గతంలో కొత్తపల్లి తహసీల్దార్, ప్రస్తుతం గజ్వేల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న చిల్ల శ్రీనివాస్‌తో పాటు 12 మందిపై కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్, అతని బినామీ గోదావరిఖనికి చెందిన చంద సంతోష్, గతంలో కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన, ప్రస్తుతం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పల్లె జీవన్‌లను గురువారం అరెస్టు చేసిన పోలీసులు కోర్టు ఆదేశాలతో రాత్రి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో 9 మంది పరారీలో ఉన్నారు. కరీం నగర్ సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘు రాజు తాత ఐలయ్యకు ఉన్న ఆరెపల్లి, సీతారాంపూర్, రేకుర్తిలలోని ఆస్తులను రఘురాజు తండ్రికి, చిన్నాన్నకి 2012లో సమాన భాగాలుగా పంచి రిజిస్ట్రేషన్లు చేయించాడు. సీతా రాంపూర్, ఆరెపల్లిలో ఉన్న భూములు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రకారమే ఆన్‌లైన్‌లో నమోదు కాగా రేకుర్తికి చెందిన సర్వేనెంబర్ 29లోని 30 గుంటల భూమి మాత్రం రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయ్యి ఆన్‌లైన్‌లో చూపించడంలేదు. దీనిపై అప్పటి కొత్తపల్లి తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను రఘురాజు సంప్రదించగా సమస్యను పరిష్కరించేందుకు లంచంగా ఆ భూమి నుంచి 3.25 గుంటల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశాడు. దీనికి బాధితుడు ఒప్పుకోలేదు. 2015లో బాధితుడి తాత ఐలయ్య చనిపోయాడు. దీంతో 2016లో ఐలయ్య అతని భార్య పేరట రిజిస్ట్రేషన్ చేసినట్లుగా నకిలీ డాకుమెంట్లు సృష్టించి, ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న అప్పటి వీఆర్‌ఏ అయిన పల్లె జీవన్ సహాయంతో, 2022 ఆగస్టులో బాధితుడి చినాన్నతో పాటు అతని నలుగురి మేనత్తల పేరిట ఒక్కొక్కరి పేరిట నాలుగున్నర గంటలు, ఎమ్మార్వో బినామీ అయిన గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌కు చెందిన చందా సంతోష్ పేరిట 3.25 గుంటల భూమి మార్చాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు రఘురాజు పేర్కొన్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా విచారణలో బాధితులు తెలిపిన వివరాలు నిజమేనని వెల్లడి కావటంతో 12 మంది చిల్ల శ్రీనివాస్, చంద సంతోష్, బొంతల రవి, బొంతల లావణ్య, ఉప్పుల కనకలక్ష్మి, దాడి రాధ, చుప్ప మంజుల, చిలువేరు స్వప్న, చిలువేరు మల్లేశం, పల్లె జీవన్, వినోద్, బుచ్చిరాజులపై ఐపీసీ 467, 468, 471, 409, 420, 120 బి రెడ్‌విత్ 34 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టులో హాజరుపరచగా, కేసును పూర్తిగా పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. కొత్తపల్లి పోలీసులు ముగ్గురు నిందితులను కరీంనగర్ జైలుకు తరలించారు.

భక్తులకు సేవ పూర్వ జన్మ సుకృతం


ఉచిత మినీ బస్సులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మార్చి 7 : భక్తులకు సేవ చేసే భాగ్యం రావడం పూర్వజన్మసుకృతమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అ న్నారు. వేములవాడ మహాశిరాత్రి జాతర సందర్భంగా గురువారం ఆర్టీసీ డిపోలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత మినీ బస్సులను ప్రారంభించారు. అనంతరం ఆలయ పరిసరాల్లోని క్యూలైన్‌లను, చలువ పందిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రి జాతరకు పేద, నిరుపేద భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారన్నారు. మహాదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ ఆధ్వర్యంలో సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయ పార్కింగ్ స్థలం వరకు 14 ఉచిత మినీ బస్సు లను ప్రయాణికుల కోసం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఉచిత బస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

● **భక్తులకు ఉచిత అల్పాహారం**

మహాశివరాత్రికి వచ్చే భక్తులకు రాజరాజేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఉచిత అల్పాహార సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ఖాళీ కడుపుతో ఉండకూడదని అల్పాహారం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, డిపో మేనేజర్ మురళీకృష్ణ ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న దేవదాయశాఖ కమిషనర్

వేములవాడ టౌన్, మార్చి 7: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని దేవదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని ఆలయానికి వీచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలి కారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామి వారి అద్దాల మండపంలో కమిషనర్‌కు అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో కృష్ణప్రసాద్ శాలువతో సన్మానించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

అడవి జంతువు మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

రాయికల్, ఫిబ్రవరి 7: మండలంలోని రాజనగర్ గ్రామానికి చెందిన రాజన్న అనే వ్యక్తిని అటవీ శాఖ అధికారులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తన వ్యవసాయ పొలం చుట్టూ కరెంట్ తీగలు అమర్చగా ఈ నెల 5న అడవి జంతువు సాంబారు మృతి చెందింది. దీంతో రాజన్నపై అటవీ శాఖ అధికారులు అటవీ సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదం కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, మార్చి 7: రోడ్డు ప్రమాదం కేసులో ఎల్లారెడ్డిపేటకు చెందిన భూక్య శ్రీనివాస్‌కు ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 3వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం... 12 జూన్ 2018న ఎల్లారెడ్డిపేటకు చెందిన మాలోతు తుకారాం తన స్నేహితుడితో కలిసి కారులో సిద్దిపేటకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా ముస్తాబాద్ మండలంలోని బద్దనకల్ వద్ద కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తుకారాం తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనపై కారు నడిపిన శ్రీనివాస్‌పై కేసునమోదు చేసి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ శ్రావణ్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ దేవేందర్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ సందీప్ వాధించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి డ్రైవర్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్షతోపాటు రూ. 3వేల జరిమానా విధించారని ముస్తాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

చంపుతామని బెదిరించిన ముగ్గురికి...

సిరిసిల్ల క్రైం, మార్చి 7: సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో ఉంటున్న దూడం సరస్వతి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి చంపుతామని బెదిరించిన చిట్యాల మధు, నాయిని శంకర్, దుబ్బ నీరజకు ఏడాది జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం... 28 జనవరి 2015న శాంతినగర్‌లోని దూడం సరస్వతి ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు ప్రవేశించారు. రూ. 25లక్షలకు ఆమె భర్త ఇల్లు అమ్మాడని, మిగతా రూ. 5 లక్షలు తీసుకొని వెళ్లిపోవాలని తీవ్రంగా దూషించి చంపుతామని బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదుతో అప్పటి ఎస్‌ఐ చీనా నాయక్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో చార్జి షీట్ దాఖలు చేయగా పీపీ చెలుముల సందీప్‌కుమార్ వాదించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధించారని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

ఏసియన్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్, మార్చి 7: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈనెల 8,9,10 తేదీల్లో జరుగనున్న 22వ అండర్-20 జూనియర్ ఏసియన్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన ఎం.వినయ్ 1500 మీటర్లు, 3000 మీటర్ల స్టిపల్ చేస్, పి.విష్ణువర్ధన్ 10వేల మీటర్ల రేస్ వాక్‌లో గత సంవత్సరం జాతీయ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ చాటిన కారణంగా ఈ పోటీలకు అర్హత సాధించారని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. ఈ పోటీల్లో కనబరిచే ప్రతిభ ఆధారంగా దుబాయ్‌లో ఏప్రిల్ 24 నుంచి 27వరకు జరుగబోయే జూనియర్ ఏసియషన్ అండర్-20 చాంపియన్ పోటీలకు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. ఈ క్రీడాకారులను కోచ్ వరుణ్‌ను డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 7: మండలంలోని పచ్చునూర్ గ్రామంలో ఆర్టీసీ బస్సు కిందపడడంతో ఓ ప్రయాణికుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన అంకం చంద్రయ్య అనే చేనేత కార్మికుడు గురువారం వ్యక్తిగత పని నిమిత్తం కరీంనగర్‌కు వెళ్లి ఇంటికి ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తున్నాడు. గ్రామంలోని యాదవనగర్ బస్టాండ్ వద్ద బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి కిందపడిపోయాడు. అతడి కాలుపై నుంచి బస్సు టైరు ఎక్కడంతో కాలు నుజ్జునుజ్జయింది. 108లో కరీంనగర్‌కు తరలించారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 7: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7, 550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 51మంది రైతులు 773క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 6,500 రూపాయలు చెల్లించారు. శుక్రవారం నుంచి మూడు రోజులు సెలువుగా అధికారులు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో బంగారం చోరీ

కరీంనగర్ క్రైం, మార్చి 7: కరీంనగర్ బస్టాండ్‌లో ఒక మహిళా ప్రయాణికురాలి హాండ్ బ్యాగ్‌లో నుంచి పద్దెనిమిదిన్నర తులాల బంగారం చోరీ అయింది. ఈ మేరకు బాధితురాలు ఒకటో టాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం ఆకునూర్ ఘనపురంకు చెందిన మెల్లం కొమురమ్మ అనే మహిళ మూడు రోజుల కిందట తన కొడుకు వద్దకు గోదావరిఖని సెంటనరీ కాలనీకి వెళ్లింది. తిరిగి స్వగ్రామం అకునూర్ ఘనపురంకు వెళ్లేందుకు గురువారం ఉదయం 9.30 గంటలకు మంథనిడిపో బస్సులో కరీంనగర్‌కు చేరుకుంది. ఆ తరువాత కరీంనగర్ బస్టాండ్‌లో హుస్నాబాద్ బస్సు ఎక్కుతున్న సమయంతో రద్దీగా ఉండి కొందరు నెట్టే ప్రయత్నం చేశారు. తీరా బస్సులోకి వెళ్లిన కొమురమ్మ తన బ్యాగ్ జిప్ తెరచి ఉండడాన్ని గమనించింది. లోపల మరొక చిన్న బ్యాగ్‌లో భద్రపరిచిన బంగారు ఆభరణాల కోసం వెదికింది. ఆ బ్యాగ్ కనపడలేదు. దీంతో రోదిస్తూ పోలీసుల వద్దకు చేరింది. బస్సులో వచ్చే సమయంలో లేదా కరీంనగర్ బస్టాండ్‌లో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తన పద్దెనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను చోరీ చేశారని బాధితురాలు తెలిపింది.

వడదెబ్బతో రైతు కూలీ మృతి

వీణవంక, మార్చి 7: కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన నేరుకుంట్ల పర్శరాం (45) అనే వ్యక్తి వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. మధ్యాహ్నం పర్శరాం వరి పంటకు ఎరువు చల్లుతున్నాడు. ఎండవేడిమికి ఒక్కసారిగా కుప్పకూలాడు. అక్కడ ఉన్న వారు 108కి సమాచారం అందించారు. సిబ్బంది పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు

వైభవంగా దుబ్బరాజన్న కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్, మార్చి 7: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దుబ్బ రాజన్న ఆలయ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తుల ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అత్యంత సుందరంగా రంగురంగుల పూలతో అలంకరించిన కల్యాణ వేదికపైకి స్వామి వారి ఉత్సవమూర్తులను ఆసీనులుగావించారు. ఈ సందర్భంగా అర్చకులు రామోజుల చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో దుబ్బ రాజరాజేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపించారు. ప్రభుత్వం తరఫున స్వామి వారికి ఆర్డీవో మధుసూదన్ దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి వార్ల కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అడూలరి అనూష, తహసీల్దార్ రమేష్, ఆలయ ఫౌండర్ పొరండ్ల శంకరయ్య, ఆలయ ధర్మకర్తలు కొండ్ర రాంచందర్‌రెడ్డి, వాసం శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌లో
కరీంనగర్ రీజియన్‌కు ప్రథమ స్థానం



పురస్కారం అందుకుంటున్న ఆర్టీసీ అధికారులు

భగత్‌నగర్, మార్చి 7: తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ పండుగలకు నిర్వహించిన గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌లో కరీంనగర్ రీజియన్‌కు ప్రథమ స్థానం లభించింది. రెండె స్థానంలో మహబూబ్‌నగర్, మూడో స్థానంలో నిజామాబాద్ నిలిచాయి. గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీకళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత సన్మానంతో పాటు, ట్రోఫి, లక్ష రూపాయల పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్‌ఎం సుచరితమాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల సమష్టి కృషితోనే అవార్డు దక్కిందన్నారు. రానున్న కాలంలో మరింత ఉత్సాహంతో పనిచేసి సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కరీంనగర్ జోన్ వినోద్‌కుమార్, డిప్యూటి రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డిపో మేనేజర్లు మల్లేశం, మల్లయ్య, మనోహర్, వేదవతి, నర్సప్ప, నాగభూషణం, అర్పిత, తదితరులు పాల్గొన్నారు.

చిట్టుమల్ల జన్మదినం సందర్భంగా అన్నదానం



అన్నదానం చేస్తున్న కన్యకాపరమేశ్వరీ ఆలయ ట్రస్టు డైరెక్టర్లు

కరీంనగర్ టౌన్, మార్చి 7: కరీంనగర్ చాంబరాఫ్ కామర్స్ అధ్యక్షుడు, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ట్రస్టుచైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్ జన్మదినం పురస్కరించుకొని గురువారం నగరంలోని గాంధీరోడ్డు శ్రీరామాలయంలో యువజన సంఘం సభ్యులు సుమారు 300 మందికి అన్నదానం చేశారు. అలాగే శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ ట్రస్టు డైరెక్టర్ల ఆధ్వర్యంలో స్వధార్ మహిళలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలాజీ అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సివిల్ హాస్పిటల్‌లో అల్పాహార వితరణ చేశారు. శ్రీసేవా మార్గ్ మునిపెల్లి ఫణిత ఆధ్వర్యంలో కొత్తపల్లి అనాథ ఆశ్రమంలో, నాన్న ఫౌండేషన్ గోగుల ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ట్రస్టు ప్రధాన కార్యదర్శి కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం శ్రీనివాస్, డైరెక్టర్లు తాటిపల్లి సుభాష్, నార్ల శ్రీనివాస్, రామిడి శ్రీనివాస్, పాలెపు మల్లికార్జున్, చిట్టుమల్ల వేణుగోపాల్, ఆకుల మెహర్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 7 : కరీంనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని రికార్డు గది తాళాలు పగులగొట్టి కీలకమైన డాక్యుమెంట్లు ఎత్తుకుపోయిన కేసులో నిందితుడు కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన సుక్‌దేవ్ శేఖర్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఒకటో ఠాణా సీఐ సరిలాల్ తెలిపారు. ఇదే కేసులో మరో ఇద్దరు నిందితులు కరీంనగర్‌కు చెందిన మతిన్, ఒసామాలు పరారీలో ఉన్నారని తెలిపారు. కాగా ఇదే ముఠా కరీంనగర్‌తో పాటు భువనగిరి, రంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని సమాచారం. ఈ దొంగతనాలకు సూత్రదారి మరొక వ్యక్తి కరీంనగర్‌కు చెందిన మీర్జా అజ్మత్ అలీబేగ్(న్యాయవాది)గా సీఐ తెలిపారు. మీర్జా అజ్మత్ అలీబేగ్ అనే వ్యక్తి కరీంనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలంలోని రికార్డు గదిలో ఉన్న బుక్ నంబరు-1, వాల్యూమ్ నంబరు 376ను దొంగిలించి తీసుకువస్తే 50 వేల రూపాయలు ఇస్తానని శేఖర్, మతిన్, ఓసామాలకు చెప్పాడని సీఐ తెలిపారు. ఈ మేరకు కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డిసెంబరు 24న రాత్రి రాత్రి సుకదేవ్ శేఖర్ కార్యాలయం తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడగా బయటనే ఉన్న మతిన్, ఒసామాలు వాట్సప్ కాల్‌లో మాట్లాడుతూ రికార్డులు ఎక్కడ ఉన్నాయి? ఏ రికార్డు అనేది ఫోన్ ద్వారా శేఖర్‌కు తెలిపగా ఆ రికార్డులను శేఖర్ దొంగిలించి తీసుకువచ్చాడని సీఐ తెలిపారు. దొంగిలించిన రికార్డులను మతిన్, ఒసామాలకు అందించగా వారు 50 వేల రూపాయలను శేఖర్‌కు ఇచ్చారని తెలిపారు. ఫోన్‌ను సీజ్ చేసి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మిగతా ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మార్చి 7: ఆర్థిక ఇబ్బందుల కారణంగా కట్టరాంపూర్‌కు చెందిన గుండ్ల మణిదీప్(28) ఆత్మహత్య చేసుకున్నట్లు ఒకటో ఠాణా సీఐ సరిలాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కట్టారాంపూర్‌కు చెందిన గుండ్ల మణిదీప్2 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఉంటూ సాఫ్టవేర్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఉద్యోగం లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. కొంత కాలం నుంచి మణిదీప్ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం ఉదయం తల్లిదండ్రులు హైదరాబాద్ వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వచ్చే సరికి మణిదీప్ తన గదిలో ఉరికి వేళాడుతూ కనిపించాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రౌడీ షీటర్‌లకు కౌన్సెలింగ్

కరీంనగర్ క్రైం, మార్చి 7: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎలాంటి నేర ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు రౌడీషీటర్లను ఠాణాలకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కరీంనగర్ రెండో ఠాణా పరిధిలోని పలువురు రౌడీషీటర్లను ఠాణాకు పిలిపించిన సీఐ ఓ రమేష్ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

● కరీంనగర్ క్రైం : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎలాంటి నేర ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సీఐఎస్ఎఫ్ బలగాలతో కరీంనగర్ మూడో ఠాణా పరిధిలో గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నాఖా చౌరస్తా, హుస్సేనిపుర, ఖాన్‌పుర, గాంధీరోడ్, అశోక్‌నగర్, కిసాన్ నగర్, మంచిర్యాల చౌరస్తాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిచారు.

నేడు ఇల్లందకుంటలో శివపార్వతుల కల్యాణం

● ఈవో ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

ఇల్లందకుంట, మార్చి 7: ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలోని అనుబంధ ఆలయమైన శ్రీరామలింగేశ్వరాలయంలో శుక్రవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు మడికొండ నవీన్‌శర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కందు ల సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామివారి కల్యాణం చేయించాలనే భక్తులు 1,016 రూపాయలు చెల్లించి కల్యాణ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. మండలంలోని సిరిసేడు, సీతంపేట, కనగర్తి తదితర గ్రామాల్లో కూడా శివపార్వతుల కల్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

శివరాత్రి జాతరకు ఆలయం ముస్తాబు

తిమ్మాపూర్, మార్చి7: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ గిరిజా మృత్యుంజయ మహాదేవాలయం శుక్రవారం నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ముస్తాబైంది. ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణం అంత విద్యుత్ దీపాలతో, రంగురంగు పూలతో అలంకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చల్లా మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు పూర్తి చేశారు.

ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గ సభ్యులు

శంకరపట్నం, మార్చి 7: శంకరపట్నం మండలం కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వుల మేరకు జిల్లా దేవాదాయ శాఖ డివిజన్ పర్యవేక్షకులు సత్యనారాయణ, ఈవో సుధాకర్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్‌గా ఉప్పుగళ్ల మల్లారెడ్డి, పాలకవర్గ సభ్యులు గరిగే ప్రభాకర్, మోకిరాల కలింగరావు, తీగల కుమారస్వామి, కేశవేణి అయిలయ్య, ఎడ్ల తిరుపతి, కొయ్యడ నీలమ్మ, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ అర్చకులు శేషం మురళీధరచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

మానకొండూర్, మార్చి 7: కరీంనగర్‌లోని వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం అన్నారం, రంగపేట గ్రామాలలో శ్రమదానం చేశారు. తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఉన్న ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను తొలగించారు. మొరం పోసి చదను చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, భారత నాస్తిక సమాజ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్, శ్రావణి, రవి, వెంకట్, తిరుపతి, రాజశేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మహిళా దినోత్సవ కార్యక్రమాలు

కరీంనగర్ అర్బన్, మార్చి 7: మహిళా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో గురువారం డీసీసీ కార్యాలయంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రంలో మహిళ రైతు లత, గైనకాలాజిస్టు డాక్టర్ ఆరుణ, మహిళా వాచ్‌మెన్ లతా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళనాయకురాలు భారతమ్మ, బస్సులలో యాత్రికులను తీసుకవెళ్లి స్వయం ఉపాధి పొందుతున్న మహిళ యశోదలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ, భారతమ్మ, పద్మ, సంధ్య, నేరెళ్ల కవిత, లత, స్వప్న, స్వరూప, పద్మ రజితారెడ్డి, వందన, సత్య ,రోజా, దేవేం ద్ర, లక్ష్మి పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు గొప్పతనానికి, ఓర్పుకు నిదర్శనమన్నారు. అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థినిలు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన కళాశాల ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ కార్యక్రమలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అక్షయమహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ జి శైలజ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, కల్యాణి, అధ్యాపకులు, సింధు, పూజిత, సాధియా పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్(సిబిఎస్ఈ)లో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అకాడమిక్ సీఈఓ ఉమాకాంత్, ప్రిన్సిపాల్ భార్గవ్, నిరంజన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● గణేశ్‌నగర్: కోరా జాన్సన్ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ఛైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, సంతోష్‌రెడ్డి, పాల్గొని పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినిలను సన్మానించారు.

● గణేశ్‌నగర్: ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్, సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న లావెండర్ బ్యూటీ జోన్ వ్యవస్థాపకురాలు ఉమారాణి, శివసాయి హోమ్ ఫుడ్స్ వ్యవస్థాపకురాలు సుజాతరెడ్డి, చింటూ ప్రింట్స్ వ్యవస్థాపకురాలు భద్రవతి పాల్గొని మాట్లాడారు.

● కరీంనగర్ కల్చరల్: మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని ఆర్డీఓ మహేశ్వర్ అన్నారు. గురువారం ఫిలింభవన్‌లో సల్వాజీ ఈవెంట్ ఆర్గనైజేషన్, ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, రాష్ట్రపతి పురస్కార గ్రహీత ఊకంటి సంపతి కుమారి ప్రారంభించారు.



అల్ఫోర్స్ మహిళా డిగ్రీకళాశాలలో కేక్ కట్ చేస్తున్న కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

● కరీంనగర్ రూరల్: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని శాతవాహన యూనివర్సిటీ పార్మసిటికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం నగరంలోని తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

● భగత్‌నగర్: శ్రామిక మహిళా కార్మికులకు కనీస వేతనం 26వేలు, పనిభద్రత కల్పించాలని సీఐటీయూ శ్రామిక మహిళా కన్వీనర్ మారెల్ల శ్రీలత అన్నారు. గురువారం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో మహిళా దినోత్సవం జరుపుకున్నారు.

● చిగురుమామిడి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ కనుమల్ల విజయ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఎంపీపీ కొత్త వినీత అధ్యక్షతన జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేశారు.

● హుజూరాబాద్: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని హుజూరాబాద్ సెకండ్ అడిషనల్ జూనియర్ జడ్జి స్వాతి అన్నారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం మండల న్యాయ సేవా అధికార సంస్థ, సంఘమిత్ర వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.

● మానకొండూర్: మండలంలోని ఊటూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్వరూపరాణి, రమాదేవి, సునీత అనే ఉపాధ్యాయురాళ్లను పూలమాల, శాలువాతో సన్మానించారు.

● గంగాధర: మండలంలోని గర్షకుర్తి సరస్వతి విద్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయినులు, తల్లులకు క్రీడలను నిర్వహించారు.

● వీణవంక: మండల కేంద్రంలోని జీవనజ్యోతి మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

సుభాష్‌నగర్, మార్చి 7: సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం నగరంలోని బుట్టి రాజారాం కాలనీలో గల అర్బన్ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని పరిశీలించారు. కిషోర బాలికలకు, యువతులు పోషకాహారం తీసుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని పేర్కొన్నారు. నిత్యం పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులు దరి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. హాస్టళ్ల కాలేజీల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత, ఎంసీహెచ్ పీవో డాక్టర్ సనా జావేరియా, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ శోభ, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఆరోగ్యమహిళ'కు ఆదరణ

● సంవత్సరంలో 26,290 మందికి పరీక్షలు ● వైద్య చికిత్స

సుభాష్‌నగర్, మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం గత మార్చి 8న మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ఆర్యోగ మహిళా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి జిల్లాలో మంచి ఆదరణ లభిస్తోంది. ఈ పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మెరుగైన చికిత్స అందిస్తారు. ఈ పథకాన్ని జిల్లా కేంద్రంలోని బుట్టిరాజారాం కాలనీలో అప్పటి మంత్రులు హరీష్‌రావు, గంగుల కమలాకర్ ప్రారంభించారు. మహిళల సాధికారిత, ఆరోగ్య రక్షణ కోసం తమ ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని బుట్టి రాజారాం కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్, గుండి కమ్యూనిటీ హెల్త్ సెంటర్, చొప్పదండి, చామన్‌పల్లి, చల్లూరు, సైదాపూర్, ఇల్లందకుంటతోపాటు రేకుర్తి, తీగలగుట్టపల్లి బస్తీ దవాఖానాలు, మొత్తం తొమ్మిది కేంద్రాల్లో ఈ ఆరోగ్య మహిళా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ తొమ్మిది కేంద్రాల్లో 26,290 మంది మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఎనిమిది మందికి కేన్సర్ వ్యాధి సోకినట్లుగా గుర్తించిన వైద్యులు వారికి అవసరమైన వైద్య చికిత్సలను అందిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు : కేటీఆర్



ఇరుకుల్లలో ఎండిన పంటను పరిశీలిస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ రూరల్, మార్చి 7: కాంగ్రెస్ పాలనలో రైతులకు కరెంట్ కష్టాలు తప్పడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్లలో సాగునీరు లేక ఎండిపోయిన పంట పొలాలను వినోద్‌కుమార్ నేతృత్వంలో రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక మొదటిసారి పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయకక్ష సాధింపు చర్యలు చేపడుతుందన్నారు. ఒక ప్రాంతానికి నీరు అందిస్తూ ఒక ప్రాంతం రైతులపై వివక్ష చూపుతుందన్నారు. ఎస్ఆర్ఎస్‌పి ద్వారా నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించాలన్నారు. పెద్దపల్లి నియోజక వర్గానికి నీరు అందిస్తున్న అధికారులు కరీంనగర్ నియోజక వర్గానికి సాగునీరు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఎస్ఆర్ఎస్‌పి ద్వారా వెంటనే నీటిని విడుదల చేసిరైతులను ఆదుకోవాలని రాష్ట్రముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, హుజూరాబాద్ శాసన సభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ శాసన సభ్యులు రసమయి బాలకిషన్, నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామక్రిష్ణారెడ్డి, చల్మెడ లక్ష్మినర్సింహారావు మండల పార్టీ అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రూ. 10.22 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్, మార్చి 7: మున్సిపాలిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 10.22 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలను సభ్యులు ఆమోదించారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అధ్యక్షతన గురువారం బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 10.22కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలను జూనియర్ అకౌంట్స్ అధికారి సంధ్యారాణి ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో సాధారణ నిధుల అంచనా ఆదాయం రూ. 6.77కోట్లు, ప్లాన్, నాన్ ప్లాన్, ఇతర నిధుల అంచనా ఆదాయం రూ. 3.45కోట్లుగా అంచనా వేశామని తెలిపారు. మొత్తం రూ. 10.22 కోట్లు అంచనా వ్యయం వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ రాంమోహన్‌రాయ్, ఈఈ ప్రభాకర్, టౌన్ ఏఈ సాంబరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అశ్వినీగాంధీ, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, అకౌంట్స్ సెక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● అక్రమ వెంచర్లపై చర్యలకు తీర్మానం

మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి, దమ్మక్కపేట, కొత్తపల్లి, జమ్మికుంట రోడ్, ఇప్పల్‌నర్సింగాపూర్, పరకాల క్రాస్ రోడ్‌లలో అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు తీర్మానం చేశారు. గత సర్వసభ్య సమావేశంలో కూడా తీర్మానం చేసి జిల్లా కలెక్టర్ నివేదించామని, ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిలర్లు ప్రశ్నించారు. వెంటనే అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కోరారు.

● జమ్మికుంటలో

జమ్మికుంట: చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన 2024-25సంవత్సరానికి రూ.24.4కోట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టగా కౌన్సిల్ సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఆమోదించారు. సాధారణ ఆదాయం రూ.7.66కోట్లు, గ్రాంట్ల ద్వారా ఆదాయం రూ.15.58కోట్లు, డిపాజిట్ల ద్వారా ఆదాయం రూ.80లక్షలు, అంచనా సాదారణ వ్యయం రూ.7.55లక్షలు, వ్యయంపై మిగులు ఆదాయం రూ.10.62 లక్షలు, మొత్తం రూ.24.4కోట్ల అంచనా బడ్జెట్ ప్రవేశ పెట్టారు. సమావేశంలో కమిషనర్ ఎండీ అయాజ్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్

చిగురుమామిడి, మార్చి 7: బీజేపీ మండల అధ్యక్షుడిగా పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్ గెలుపు కోసం పాటుపడు తామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.


నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

సైదాపూర్, మార్చి 7: మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్, గుజ్జులపల్లి, బొమ్మకల్ గ్రామాలలోని శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్ గురువారం తెలిపారు. ఉదయం 6.30కి ఎక్లాస్‌పూర్, 7గంటలకు గుజ్జులపల్లి, 7.30కి బొమ్మకల్ గ్రామాలలోని శివాలయాలను దర్శించుకొంటారని తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుజూరాబాద్, మార్చి 7: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్‌లో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్ పట్టణంతో పాటు బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో ప్రణవ్

హుజూరాబాద్‌రూరల్, మార్చి 7: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రణవ్ నివాస గృహంలో కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడెం గ్రామానికి చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారికి వొడితెల ప్రణవ్ పార్టీ కుండవా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చరణ్ పటేల్, నారాయణరెడ్డి, కుంభంపాటి ప్రసాద్, భిక్షపతి, రాజు, కొండ తిరుపతి, మనీష్, సదన్న, రవి తదితరులు ఉన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జమ్మికుంట, మార్చి 7: జమ్మికుంట రైల్వే స్టేషన్లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేందుకు కృషి చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ కుమార్, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ల చిత్ర పటాలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం క్షీరాభిషేకం చేశారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

10న మంత్రి పొన్నంకు సన్మానం

సుభాష్‌నగర్, మార్చి 7: ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐక్యవేదిక బాధ్యులు బూర్గుల సత్యనారాయణ, రాచకొండ తిరుపతి తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

9న 'నారీ విజయ భేరి'

సుభాష్‌నగర్, మార్చి 7: ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న నారీ విజయ భేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు మూగ జయశ్రీ తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని రంగాల్లోని మహిళలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఆయా రంగాల్లో రాణించిన వారిని పోత్సహించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ నెల 9న నగరంలోని రెవెన్యూ గార్డెన్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో వివిధ పోటీలు, వస్తువుల తయారీ వంటి వాటిపై అవగాహన కల్పిస్తామ న్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, మార్చి 7: నగరంలోని పాత బజార్ గౌరీశంకరాలయంలో గురువారం కైలాసవాసుడు పేరుతో నిర్మించిన యూట్యూబ్ చానల్ పాట పోస్టర్‌ను అర్చకుడు పురాణం మహేశ్వరశర్మ, ఈఓ వెంకన్న ఆవిష్కరించారు. నటుడు కలర్ సత్తన్న, పాట రచయిత రంగు గోవర్ధన్, సహ దర్శకుడు రామ్ మొగిలోజు, గాయకుడు వడ్లకొండ అనిల్, శ్యామల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన కిమ్స్ క్రీడోత్సవాలు

కరీంనగర్‌స్పోర్ట్స్, మార్చి 7: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో రెండురోజులుగా నిర్వహించిన కిమ్స్ క్రీడోత్సవాలు గురువారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ సాకేత్‌రామారావు పాల్గొని విజేతల జట్లకు ట్రోఫీలను, బహుమతులను అందజేశారు. పురుషులకు క్రికెట్, మహిళలకు ఖోఖో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్ అర్జున్ రావు, అనూప్‌రెడ్డి, డాక్టర్ నవీన్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ ఆది నారాయణ, రవీంద్రాచారి పాల్గొన్నారు.

'మంత్రి కొండా సురేఖ వాఖ్యలు సరికాదు'

సుభాష్‌నగర్, మార్చి 7: రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఎస్పీ నార్త్‌జోన్ మహిళ కన్వీనర్ జన్ను స్వరూప అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై మంత్రి సురేఖ గుండాయిజం అంటూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మంత్రి కొండ సురేఖ తక్షణమే క్షమాపణ చేప్పాలన్నారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్, మహిళ జిల్లా కోకన్వీ నర్ ప్రమీల, అసెంబ్లీ కన్వీనర్ అల్లూరి అనురాధ, కో కన్వీనర్ ప్రమీల, రియాజ్‌పర్వీన్ పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు అభినందన

గణేశ్‌నగర్, మార్చ్7: 'తెలంగాణ రాష్ట్రం.. ఉన్నత విద్యలో నూతన ఆవిష్కరణలు' పరిశోధనల సంకలనం గ్రంథాన్ని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కే. రామకృష్ణ ఐ.టి. శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అందజేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రచురించిన ఉన్నత విద్యలో నూతన ఆవిష్కరణలు, జాతీయ విద్యా విధానం అమలు వంటి పలు అంశాలపై విలువైన వ్యాసాలను ఇందులో పొందుపరిచారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు కళాశాల అధ్యాపకులను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో డిగ్రీ ప్రవేశాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారని వారు తెలిపారు.

యజ్ఞవరాహక్షేత్రంలో అధ్యయనోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 7: ప్రతీ యేడు నిర్వహించే అధ్యయనోత్సవాలను గురువారం నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీవైష్ణవ ద్విజులు తిరువాయిమొజి సేవాకాలాన్ని జరిపారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్: ఎమ్మార్పీఎస్ మండల హడక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హుజూరాబాద్ పట్టణానికి చెందిన రొంటాల రాజ్‌కుమార్‌ను ఎమ్మార్పీఎస్ హడక్ కమిటీ మండల కన్వీనర్‌గా, రాజపల్లి గ్రామానికి చెందిన మునిగాల పోషయ్యను కో-కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకుడు ఆర్ సాగర్ గురువారం తెలిపారు.

● శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో గురువారం మహిళా పొదుపు సంఘం అధ్యక్షురాలుగా పిన్‌రెడ్డి మమత, ఉపాధ్యక్షురాలుగా చింతరెడ్డి సునీత, పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

● ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల మహజన్ సోషలిస్టు పార్టీ అధ్యక్షుడిగా మేకల యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఇంజం వెంకటస్వామి, చేరాలు, మహేందర్, రాం శివ తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాలలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్ డాక్టర్ హిమబిందు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మంజుల, సూపర్వైజర్ స్వరూప, సిబ్బంది ఉన్నారు.

● గంగాధర: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని వివేకానంద విద్యాలయం కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

● రామడుగు: రామడుగు ఎస్సైగా సురేందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

- మండలంలో రెండో విడత కింద మంజూరైన గొర్రెలను పంపిణీ చేయాలని మండల పశువైద్యాధికారి అనిల్‌కు గురువారం గొర్రెల పెంపకం దారులు వినతి పత్రం అందజేశారు. వెంటనే పంపిణీ చేసి ఆదుకోవాలని సంఘం మండల అధ్యక్షుడు కడారి వీరయ్య కోరారు.

- మండలంలోని గోపాల్‌రావుపేటలోని ప్రధాన కూడలిలో నేచర్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం ఆవిష్కరించనున్నారని సంఘ సభ్యులు తెలిపారు.

● గన్నేరువరం: మండలంలోని జంగపల్లి, గన్నేరువరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 116మంది విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, హాల్‌టికెట్ కవర్లను గురువారం అందజేశారు.